నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ మంగళవారం 4 జూన్ 2024 | ADILABAD NIRMAL

నిర్మాణ పనులు త్వరగా చేయండి..

కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, జూన్ 3 : అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పాఠశాల అదనపు తరగతి గదుల పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం వాగాపూర్ లో పనులను పరిశీలించారు. ఈ నెల12 తేదీ నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని, ఈలోగా పనులు పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులను పరిశీలించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఇంజినీర్లు అరుణ్, సంతోష్, ఏపీఎం చంద్రశేఖర్ ఉన్నారు.

ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

విత్తన దుకాణాల తనిఖీ

విత్తన షాపులను కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు. విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా రెవెన్యూ, పోలీసుల సమక్షంలో విత్తన ప్యాకెట్లను పంపిణీ చేయించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ కుమార్, ఏవో విశ్వామిత్ర ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

జైనథ్, జూన్ 3 : వర్షకాలం వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం బాలాపూర్ గ్రామానికి చెందిన ఆదిలాబాద్ రిమ్స్ ల్యాబ్ టెక్నీషియన్ కడ్సె ప్రశాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాగా.. గ్రామంలోని 85 మంది రోగులను పరీక్షలు నిర్వహించారు. 25 మందికి రక్త పరీక్షలు, 25 మందికి హెచ్‌టీఎన్, 11 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల వినోద్ యాదవ్, పీహెచ్‌సీ వైద్యురాలు నైనత, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్‌ఎం మమత, ఆశ వర్కర్ వందన పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో నరేందర్

రిజల్ట్ డే

నేటి పార్లమెంట్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

మూడు కేంద్రాల్లో లెక్కింపు.. ఉదయం 8 గంటలకు ప్రారంభం

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

ఖానాపూర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి

ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ హాల్

ఆదిలాబాద్ జిల్లాలో కౌంటింగ్ నిర్వహించే సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాల

ఆదిలాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు(మంగళవారం) జరగనుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మే 13వ తేదీన పోలింగ్ జరుగగా ఈవీఎంలను పటిష్టమైన బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్లను టీటీడీసీ, ఖానాపూర్, నిర్మల్, మథోల్ నియోజకవర్గాల ఓట్లను సంజయ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల ఓట్లను సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభంకానుండగా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలైన ఓట్లను పోలింగ్ బూత్‌ల ఆధారంగా లెక్కిస్తారు. ఈవీఎంలలో పోలైన ఓట్లను రౌండ్‌లవారీగా లెక్కిస్తారు. ఓట్లు లెక్కింపు జరగనుండగా ఒక్కో రౌండ్‌కు 14 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ఓట్లను లెక్కించడానికి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లను నియమించగా వారికి అధికారులు శిక్షణ ఇచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి భోజనం, మౌలిక వసతులతోపాటు తాగునీరు, టాయిలెట్స్, వైద్య సౌకర్యం అందుబాటులో ఉంచారు. సిబ్బంది ఉదయం ఆరు గంటలకు తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

కౌంటింగ్ విధుల్లో 508 మంది

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో మే 13వ తేదీన ఎన్నికలు జరుగగా 74.03 శాతం పోలింగ్ నమోదైంది. 16,50,175 మంది ఓటర్లకు 12,21,563 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి రౌండ్‌కు 14 టేబుళ్లలో ఓట్లను లెక్కిస్తారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌లో ముగ్గురి చొప్పున సిబ్బంది ఉంటారు. వీరితోపాటు అదనంగా 20 శాతం కలిపి 378 మంది కౌంటింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించడానికి 65 మంది, 17 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 31 మంది కౌంటింగ్ అసిస్టెంట్‌లు, 17 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. కౌంటింగ్ ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సోమవారం పరిశీలించారు. ఈ ఎన్నికల్లో తమ విజయంపై బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తయ్యే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

1100 మందితో బందోబస్తు

- ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, జూన్ 3 : ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు 1100 మంది పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఐ లవ్ ఆదిలాబాద్ నుంచి మావల పోలీస్ స్టేషన్ వరకు సామాన్యులకు అనుమతి లేదని, ఎంపీ ఎన్నికల్లో పోటీదారుల ఏజెంట్లు, పాసులు ఉన్నవారికి మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ర్యాలీలు, సభలకు అనుమతిలేదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మంగళవారం మద్యం దుకాణాలు బంద్ ఉండనున్నట్లు తెలిపారు. కేఆర్కే కాలనీ వాసులు మావల పోలీస్ స్టేషన్ మీదుగా ఉన్న దారిని వాడుకోవాలని సూచించారు. కౌంటింగ్ ముగిసే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

ఓట్ల లెక్కింపు హాల్

కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైంది..

- సీఎం సొంత జిల్లాలోనే హస్తం చిత్తు చిత్తయింది..
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం సాధించారు..
- ప్రజా సమస్యలను గాలికొదిలేసిన రేవంత్ సర్కారు
- బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్, జూన్ 3(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఐదున్నర నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం కరువుకాష్టంగా మారుస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

విత్తనాలు, రైతుబంధు, విద్యుత్, సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకత ఫలితంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోనే బీఆర్ఎస్ విజయం సాధించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ కొన్ని రోజుల్లో బీజేపీ చేరుతారని, గతంతో బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్‌ను దెయ్యమని విమర్శించి నేడు పొగుడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యూనిస్ అక్బానీ, రోకండ్ల రమేశ్, అలాల అజయ్, విజ్జిగిరి నారాయణ, దాసరి రమేశ్, మెట్టు ప్రహ్లాద్, సాజీదొద్దీన్, బండారి సతీష్, సలీం పాషా, కస్తాల ప్రేమల, కరుణ, తులసి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ కైలాష్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఎదుట గ్రూప్ ఫొటో దిగుతున్న మాజీ మంత్రి రామన్న, ఎంపీ అభ్యర్థి సక్కు, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు

ముగిసిన దశాబ్ది పండుగ

మూడు రోజులు వైభవంగా నిర్వహించిన బీఆర్ఎస్

అమరులకు నివాళి.. జాతీయ, పార్టీ జెండాల ఎగురవేత.. ● దవాఖానలు, అనాథ శరణాలయాల్లో పండ్లు, స్వీట్ల పంపిణీ

నిర్మల్ అర్బన్ : బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేస్తున్న విజయలక్ష్మి, బోథ్ ఎమెల్యే అనిల్ జాదవ్

నిర్మల్ అర్బన్ : ముగింపు కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. జూన్ 1వ తేదీ నుంచి మూడు రోజులపాటు వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఉద్యమ నేత కేసీఆర్ పిలుపు మేరకు వేడుకలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో చేపట్టారు. జూన్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళులు అర్పించారు. రెండో తేదీన కేంద్ర పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ అధినేత సమావేశాన్ని నిర్వహించారు. మూడో రోజైన సోమవారం జిల్లాల్లోని పార్టీ కార్యాలయాల్లో జాతీయ, పార్టీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా దవాఖానలు, అనాథ శరణాయల్లో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు పాల్గొన్నారు. నిర్మల్ పార్టీ కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగుర వేశారు.

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కైలాష్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా, బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి అత్రం సక్కు, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు

'స్థానిక' ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం

- కాంగ్రెస్ పార్టీవి అమలుకు నోచుకోని హామీలు
- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్

నిర్మల్ అర్బన్, జూన్ 3 : అమరుల త్యాగాలు చిరస్మరణీయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. 60 ఏండ్లలో సాధించలేని అభివృద్ధిని కేవలం పదేండ్లలోనే చేశారని చెప్పారు. అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ చేసిన అభివృద్ధికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోని వచ్చిన ఐదు నెలలకే రాష్ట్రంలో విద్యుత్ కోతలు

నిర్మల్ అర్బన్ : దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న బోథ్ ఎమెల్యే అనిల్ జాదవ్

మొదలయ్యాయని, ఎరువులు, విత్తనాల కొరత ఏర్పడిందని, ధాన్యం కొనుగోలు చేయక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జాన్సన్ నాయక్‌ను నియోజకవర్గ సమన్వయ కర్త రాంకిషన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు జాన్సన్ నాయక్, మాజీ జడ్పీ చైర్మన్ శ్యాంసుందర్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, ముధోల్ నియోజకవర్గ సమన్వయ కర్త విలాస్, నజీరొద్దీన్, జడ్పీటీసీ జీవన్‌రెడ్డి, నాయకులు జీవన్ రావు, నాగభూషన్, నరహరి పాల్గొన్నారు.